క్లుప్తంగా

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

• వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: పేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పొట్లపూడి గ్రామంలో గురువారం సుధీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజల్ని నట్టేట ముంచేశాడన్నారు. సూపర్ సిక్స్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో నేటికీ విశ్వాసం ఉందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు.

కిరీటం అందజేత


కిరీటాన్ని అందజేస్తున్న దాతలు

మనుబోలు: మండల కేంద్రంలో ఉన్న సాయిబాబా మందిరానికి వెండి కిరీటాన్ని గురువారం దాతలు అందజేశారు. మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి అల్లుడు ఎన్‌ఆర్‌ఐ కలికి రమేష్‌రెడ్డి, రేణుక దంపతులు సాయినాథునికి రూ.30 వేల విలువ చేసే కిరీటాన్ని చేయించి అందించారు. అర్చకుడు శ్రీనివాసులు ప్రత్యేక పూజల అనంతరం కిరీటాన్ని బాబాకు అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సురేష్‌బాబును పాఠశాల గురువారం ఘనంగా సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలో యువతేజం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో కోటేశ్వరరావు, సురేష్‌బాబుకు ఉత్తమ టీచర్ అవార్డులను అందుకున్నారు. దీంతో స్కూల్ హెచ్‌ఎం చలపతి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు.

అభినందన



విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ ఐఏఎస్ డాక్టర్ పి.కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా నియమించిన సందర్భంగా కళాశాలలో పూర్వ విద్యార్థుల తరఫున గురువారం ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలకు అందించిన సేవలను ప్రిన్సిపల్ బి.సుజాత కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, పూర్వ విద్యార్థుల సంఘ కన్వీనర్ శ్రీనివాసులు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి కృషి

కొడవలూరు : తలమంచి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినందున సీఎస్సార్ సంస్థ ద్వారా రెండు అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని సమగ్ర శిక్ష ఏపీసీ(అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్) సీహెచ్.ఉషారాణి చెప్పారు. మండలంలోని తలమంచి ప్రాథమిక పాఠశాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడాన్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి సీఎస్సార్ సంస్థ ముందుకొచ్చిందని, ఆ సంస్థ ద్వారా పాఠశాలలో రెండు అదనపు గదులను నిర్మించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం ఆమె తలమంచి వీపీసీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చే రాగిజావ నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు స్వయంగా ఆమె చేతుల మీదుగా తాగించారు. రాగిజావ ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. ఆమె వెంట ఎంఈఓ ఎస్.అంకయ్య, హెచ్‌ఎంలు పి.సుదర్శన్‌బాబు, జి.రవీంద్రబాబు ఉన్నారు.

డీజీఎం పరిశీలన

కోవూరు: కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో జరుగుతున్న కంప్యూటీకరణ ప్రక్రియను ఆప్కాబ్ డీజీఎం శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పడుగుపాడు సహకార పరపతి సంఘం, తోటపల్లిగూడూరులో ఉన్న పేడూరు సహకార పరపతి సంఘాల్లో కంప్యూటీకరణ ప్రక్రియ జరుగుతోందన్నారు.

ఈ-క్రాప్ నమోదుతోనే రాయితీలు

• క్రాప్ బుకింగ్ తర్వాత ఈ-కేవైసీ చేస్తున్న వ్యవసాయ శాఖ
• అభ్యంతరాలు వెల్లడిస్తే మార్పులు, చేర్పులు

జిల్లాలో..

వ్యవసాయ పంటల విస్తీర్ణం **49,898.69** ఎకరాలు

ఈ-క్రాప్ చేసిన పంటలు విస్తీర్ణం **49,393.63** ఎకరాలు

ఉద్యాన పంటల విస్తీర్ణం **60,602.36** ఎకరాలు

ఈ-క్రాప్ చేసిన పంటల విస్తీర్ణం **59,159.04** ఎకరాలు

సోషల్ ఫారెస్ట్ విస్తీర్ణం **16,555.31**

సోషల్ ఫారెస్ట్ పంటల విస్తీర్ణం **14,299.18**


పంట పొలంలో ఈ-క్రాప్ బుక్ చేస్తున్న వీఏఏ (ఫైల్)


రైతులతో మాట్లాడుతున్న ఏఓ వాసు

పొదలకూరు : రైతులు వ్యవసాయపరంగా రాయితీలు పొందాలంటే పంటల నమోదు తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఈ-క్రాప్ బుకింగ్(పంటల నమోదు)ను వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు 96.96 శాతం పూర్తి చేయగలిగారు. గత ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతు పథకాలకు దూరం కాకూడదని ఈ-క్రాప్ బుకింగ్‌ను పకడ్బందీగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ప్రతి ఏడాది ఈ-క్రాప్ బుకింగ్ జరుగుతుంది. గతంలో గ్రామస్థాయిల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు కీలకంగా మారడంతో అక్కడి నుంచే పంటల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయించే వారు. ఇందుకోసం ఆర్బీకేల ఉద్యోగులు క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేసి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయగలిగారు. ఇప్పుడు రైతుసేవా కేంద్రాలుగా పేరు మార్చి ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయితే తప్పొప్పులను సరిదిద్దేందుకు గత ప్రభుత్వం ప్రతి ఆర్బీకేలో గ్రామసభను నిర్వహించి రైతులకు వివరించి నమోదులో పొరపాట్లు ఉంటే సరి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతుందో లేదో తెలియాల్సి ఉంది. ఈనెల 25వ తేదీ వరకు ఈ-క్రాప్ బుకింగ్‌ను పొడిగించారు. వాస్తవానికి ఈనెల 15వ తేదీనే ఈ-క్రాప్ బుకింగ్‌ను పూర్తి చేయాల్సి ఉంది. అయితే కొన్నిచోట్ల పూర్తి కాని కారణంగా జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి గడువు పొడించారు.

రైతులకు ఉపయోగం

ప్రభుత్వం రైతులకు అందజేసే ప్రతి సంక్షేమ పథకం, సబ్సిడీలకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి చేశారు. ఇందువల్ల అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందజేసే పథకాలు వర్తిస్తాయి. రైతుభరోసా, పంటల బీమా, పండించిన పంటకు మద్దతు ధర వర్తించాలంటే ఈ-క్రాప్ బుకింగ్ విధిగా చేయించుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ, ఉద్యానశాఖలు సంయుక్తంగా ఆర్బీకేల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది ద్వారా లక్ష్యాలను నిర్ణయించి ఈ-క్రాప్ బుకింగ్ చేయిస్తుంటారు. క్షేత్రస్థాయిలో వెళ్లి ఆయా పంటలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పంటలను నమోదు చేస్తున్నారు. ఫలితంగా రైతులు ఆయా సీజన్లకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, ఇతర రాయితీలను పొందాలంటే ఈ-క్రాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ధాన్యానికి మద్దతు ధర కూడా పంట నమోదు ద్వారానే లభిస్తున్నందున చాలామంది రైతులు స్వచ్ఛందంగా కూడా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటున్నారు.

కీలకంగా ఈ-కేవైసీ

రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్నా తర్వాత ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంటుంది. పంట సాగు చేసే రైతు బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ-కేవైసీ ప్రధాన ఉద్దేశం నిజమైన రైతులను గుర్తించడమే. ఇందులో రైతుకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని వ్యవసాయశాఖ నిక్షిప్తం చేసి ఉంటుంది. ఈ-కేవైసీ సక్రమంగా చేయగలిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల సంక్షేమ పథకాలు, రాయితీలను పొందేందుకు అవకాశం ఉండదు.

ఇబ్బందులుండవు

బుకింగ్‌లో పేర్లు, విస్తీర్ణం, సర్వేనంబర్లు, పంట రకాల నమోదులో తప్పులు ఉంటే రైతులు వెంటనే వెల్లడిస్తే సవరించడం జరుగుతుంది. ఫలితంగా రైతుల పంట బీమా, ధాన్యం విక్రయానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండదు.

ఈ-క్రాప్ బుకింగ్ మేలే..



రైతులకు ఈ-క్రాప్ బుకింగ్ వల్ల ఎంతో మేలు. రైతులు ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారో తెలియడంతో పాటు రాయితీలు పొందేందుకు అవకాశం ఉంటుంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు కూడా పంటల నమోదు ఉపయోగపడుతుంది.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో పేర్లు, పంటల విస్తీర్ణం, ఆధార్‌నంబర్ల నమోదులో తప్పులు ఉంటే సరి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరైతు జాబితాలో పేర్లను పరిశీలించి అన్ని సక్రమంగా ఉండేలా బాధ్యత తీసుకోవాలి. బుకింగ్ తర్వాత ఈ-కేవైసీ తప్పసరిగా చేయించుకోవాలి.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

125 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింక్ వెహికల్ ద్వారా నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు గురువారం కూడా కొనసాగాయి. మండలంలోని యల్లాయ పాళెం, రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడులకు చెందిన 125 మందికి గురువారం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని కేన్సర్ వైద్య నిపుణురాలు డి.పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ పర్యవేక్షించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



కొడవలూరు: హిందీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆ పాఠశాల హిందీ పండిట్ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లక్ష్మీ సుప్రియ, కృష్ణ తేజ, జస్వంతీలు 2023–24 విద్యా సంవత్సరపు పది పరీక్షల్లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి వంతున పాఠశాల హిందీ పండిట్ జి.నాగభూషణం సొంత నిధులతో ప్రోత్సాహకాలను అందించారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టా సురేష్, వీబీ.శ్యామ్, కొనిజేటి సురేష్, మల్లికార్జునరావు, హజరత్తయ్య, కుసుమ, మాధవి, హసీనా పాల్గొన్నారు.

అవినీతిపై ప్రశ్నిస్తూనే ఉంటాం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

• వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి జరిగితే తాము ప్రశ్నిస్తూనే ఉంటామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, సొసైటీ మాజీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పలుకూరు పోలిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతికి పాల్పడుతున్నాడు కాబట్టే కాకాణి ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో సూరాయపాళెం, మహ్మదాపురం గ్రామాల్లో రీచ్‌లను నిర్వహించలేదన్నారు. విరువూరులో అక్రమంగా ఇసుక తరలించారని టీడీపీ నాయకులు నిరూపించాల్సిందిగా పేర్కొన్నారు. టీడీపీ నాయకులను తాము ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులను పెట్టిస్తున్నట్లు విమర్శించారు. అక్రమ కేసులకు భయపడే పనిలేదని, న్యాయపోరాటం సాగిస్తామన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు కేతు రామిరెడ్డి, జి.శ్రీనివాసులు, నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, ఎన్.శ్రీనివాసులురెడ్డి, కె.మస్తానయ్య, వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై


అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాకేష్

మనుబోలు: విద్యార్థులు, ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎంఎస్ రాకేష్ సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక నేడు


పీడీలకు సూచనలిస్తున్న ఎంఈఓ అంకయ్య

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 క్రీడా జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎస్.అంకయ్య తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో గురువారం అయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్(షటిల్), యోగా, చెస్, అథ్లెటిక్స్‌లకు సంబంధించి అండర్–14, 17 విభాగాల్లో జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు యల్లాయపాళెం హైస్కూల్ వద్దకు చేరుకోవాలన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లు నియోజకవర్గ స్థాయిలో త్వరలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. సమావేశంలో పీడీలు వెంకటేశ్వర్లు, ఇంతా శ్రీధర్‌రెడ్డి, కె.సుబ్బారావు, చెన్నారావు, బి.శ్రీవిద్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


వెంకటాచలం: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వెంకటాచలం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో మండలంలోని కాకుటూరులో గురువారం ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నివాసాల వద్దనున్న ఇంకుడు గుంతలను పూడ్చేసి, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, కెమిస్ట్రీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు అడుగులేద్దాం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రజలందరూ స్వచ్ఛతవైపు అడుగులేయాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మెప్మా సిబ్బంది పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కులో గురువారం పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

22న బహిరంగ సభ


ఈపూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ కోసం ఈనెల 22వ తేదీన ముత్తుకూరులో తలపెట్టిన బహిరంగసభను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రచార జాత గురువారం ఈపూరు, వెంకటనపాళెం, కోళ్లమిట్ట, మిట్టపాళెం గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణపట్నం పారిశ్రామిక క్లస్టర్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, అధ్యక్షుడు గడ్డం అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నేత నక్కా రాధయ్య మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ నిలిపివేయడం వల్ల వందల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోయారని విచారం వెలిబుచ్చారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా నిమజ్జనం



విడవలూరు : స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం గురువారం వైభవంగా జరిగింది. తొలుత స్థానిక యువత ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలమాలలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. రామతీర్థం సముద్రంలో నిమజ్జనం చేశారు.

భానురాజుకు నివాళి



వెంకటాచలం: సీపీఎం సీనియర్ నాయకుడు టీపీ భానురాజు 10వ వర్ధంతిని మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో గురువారం నిర్వహించారు. భానురాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొట్టేపాళెం సుధాకర్, ఒడూరు వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు


కోవూరు : ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు


మనుబోలు: పరుగుపందెంలో తలపడుతున్న బాలికలు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఏస్సార్ జెడ్పీ హైస్కూల్లో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను నిర్వహించారు. వీటిని ఎంఈఓ–1 కె.రేణుక ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు 100, 200, 400, 800, 1,500 రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్ తదితర వాటిల్లో పోటీలు పెట్టి ఎంపికలను నిర్వహించామని సర్వేపల్లి నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కో–ఆర్డినేటర్ విజయ్‌విశ్వేశ్వరన్ వెల్లడించారు. రెండోరోజున వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగాల్లో ఎంపికలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్ రామకృష్ణయ్య, కె.సనత్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• మనుబోలు: స్థానిక బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండల స్థాయి ఆటల పోటీలను స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారి ప్రారంభించారు. 200, 400 మీటర్ల పరుగుపందేలు, రిలే, అథ్లెటిక్స్, యోగా విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. పోటీలను పీడీ ప్రమీలారాణి పర్యవేక్షించారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ రేణుక

• కోవూరు : మండలంలోని పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు గురువారం జరిగింది. ఈ పోటీలను హెచ్‌ఎం గణపతి వెంకటేశ్వరనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు


పొదలకూరు: మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: శాంతినగర్‌లో..

పొదలకూరు: మండలంలోని విరువూరు, ముదిగేడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. వెంకటాచలం ఐసీడీఎస్ సీడీపీఓ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే రక్తహీనత తగ్గుతుందన్నారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలను నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, జ్యోతిలక్ష్మి, భాగ్యలక్ష్మి, స్కూల్ టీచర్లు కల్యాణి, అనూరాధ, ఎంఎస్‌కే రూప, ఏఎన్‌ఎం అరుణ, ఆశావర్కర్లు వెంగమ్మ, కౌసల్య పాల్గొన్నారు.

• మనుబోలు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పిడూరు మిక్స్‌డ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, విజయమ్మ, కృష్ణవేణి, ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

• బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహార కిట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ హెచ్‌ఎం ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త మాధవి మాట్లాడుతూ పోషకాహార కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు ఇంతియాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజమ్మ, పద్మలత, ప్రమీల పాల్గొన్నారు.

• కొడవలూరు : మండలంలోని పాతవంగల్లు వడ్డిపాళెంలో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకురాలు ఎస్.నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మావతి, విజయ, సహాయకురాలు సీహెచ్.అరుణ పాల్గొన్నారు.

• ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం సెక్టార్ కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. పల్లిపాడు సెక్టార్ కొమరిక గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.